స్పష్టమైన సమాచారం అందించండి

ఏక సభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

వార్త మెయిన్‌లో..

వినతులను స్వీకరిస్తున్న ఏక సభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, కలెక్టర్ సుమిత్ కుమార్

పింఛన్ల ఏరివేత షురూ..!

వికలాంగ పింఛన్ల వెరిఫికేషన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధమైంది... ముందుగా వికలాంగ పింఛన్ల వెరిఫికేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సోమవారం నుండీ జిల్లాలో వికలాంగ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను సదరం క్యాంపుల ద్వారా పరిశీలించి రీ అసెస్మెంట్ (కొత్త ధృవీకరణ) పత్రాలను అందజేయనున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 20వ తేదీ సోమవారం నుండీ జిల్లాలో సెప్టెంబర్ 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సదరం క్యాంపులు నిర్వహించనున్నారు. మొదటివిడతగా జిల్లాలోని కుప్పం, నగరి, పలమనేరు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వారంలో మూడురోజులు చొప్పున ఎంపిడీలు, మున్సిపల్ కమిషనర్లు నేతృత్వంలో ఈక్యాంపులు నిర్వహించనున్నారు. రోజుకు 50 చొప్పున అంటే ఉదయం 25 మంది, మధ్యాహ్నం 25 మంది వికలాంగ పింఛన్ పొందుతున్న లబ్ధిదార్లను సదరం క్యాంపుల వద్ద వారికి ఉన్న వికలాంగ శాతం గుర్తించి డాక్టర్ల బృందం కొత్త సదరం సర్టిఫికేట్లు జారీ చేస్తారు.

వికలాంగ శాతం తక్కువుంటే పింఛన్ రద్దు..

ప్రభుత్వం నిర్వహిస్తున్న సదరం క్యాంపులో వైద్యులు గత సర్టిఫికేట్లులో ఉన్న వికలాంగ శాతం ప్రస్తుతం వైద్య పరీక్షలు నిర్వహించి కొత్త సర్టిఫికేట్లు జారీలో తక్కువ వికలాంగ శాతం ఉన్నట్లు గుర్తిస్తే ఇలా గుర్తించిన వారికి ప్రస్తుతానికి వస్తున్న వికలాంగ శాతం పింఛన్ లబ్ధి తగ్గించడంతోపాటు వికలత్వం లేన్నట్టేయితే రద్దు చేయనున్నారు.

గతంలో వైద్య బృందం పరిశీలించి జారీ సర్టిఫికేట్ల స్థానంలో కొత్త సర్టిఫికేట్ల జారీచేయడంలో వ్యత్యాసాలు వచ్చే అవకాశమున్నట్లు అధికార పార్టీ భావిస్తోంది. పింఛన్ల మంజురులో గతంలో అనేక అక్రమాలు అవకతవలు జరిగాయని ఎన్నికల ముందు నుండీ ఆరోపిస్తోంది. ఎన్నికల ముందు అన్ని పింఛన్లు పెంచుతాం.... అర్హులందరీ అందిస్తామంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం పింఛన్ల ఏరివేతకు పూనుకోవడం పట్ల పింఛనుదార్లు, వామపక్షాలు, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా వెరిపికేషన్స్ పేరిట ఆర్థికంగా వెనుకబడిన పేదలకు అందించే సామాజిక పింఛన్స్ సర్వేల పేరిట ఇబ్బందులకు గురి చేయడం సరికాదంటున్నారు.

జిల్లాలో పింఛన్ల వివరాలు ఇలా...

రాష్ట్ర ప్రభుత్వం మంజురు చేస్తున్న

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు చిత్తూరు జిల్లాలో వివిధ రకాల సామాజిక పింఛన్లు 2,67,240 ఉన్నాయి. నెలకు రూ.113.49 కోట్లు పంపిణీ చేస్తోంది. ఇందులో వృద్యాప్య 1,40,703, వితంతు 59,807, ఒంటరి మహిళ 5,714 , వికలాంగ 35,277, ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ పింఛన్ పొందేవారు 1,015, బుద్ధిమాద్యం 921ఉన్నాయి. అలాగే అభయ హస్తం, డప్పు కళాకారులు, హిజ్రాలు, చేనేత, సైనికల వెల్‌పేర్‌తోపాటు వివిధ రకాల పింఛన్స్ ఉన్నాయి.

పింఛన్ల కుదింపుకే సర్వేలు..

పింఛన్లు కుదించేందుకు సర్వే సాకుతో అనర్హులుగా తేల్చి సామాజిక పింఛన్లకు మంగళం ఫలికేలా ప్రభుత్వం పావులు కదుపుతోంది. ముందుగా వికలాంగ పింఛన్ల సర్వేకు చేపట్టింది. రెండు నెలలకు ముందు ఫైలెట్ ప్రాజెక్టుగా చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లిలో నిర్వహించిన వికలాంగ పింఛన్ సర్వేలో 17 పింఛన్లను సర్వే చేస్తే ఇందులో ముగ్గుర్ని అనర్హులుగా గుర్తించారు. జిల్లాలో రెండు లక్షలకు పైగా ఉన్న వివిధ రకాల సామాజిక పింఛన్స్ మొదటి విడత వికలాంగ పింఛన్లు, తరువాత వృద్యాప, వితంతు, ఒంటరి మహిళ పింఛన్లు సర్వే చేపట్టనుంది. సర్వేల పేరిట నివాస స్థలం ఎక్కువగా ఉందనే, ఇంట్లో ఉద్యోగి ఉన్నారంటూ వ్యవసాయ భూములున్నాయి. విద్యుత్ బిల్లులు ఎక్కవస్తోంది. ఇంట్లో ట్యాక్స్ పేయర్స్ ఉన్నరనో ఇలాంటి కారణాలతో ప్రభుత్వం సామాజిక పింఛన్లను భారీస్థాయిలో కుదించేందుకే సర్వేలు చేపడుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎన్నికల ముందు సామాజిక పింఛన్లను కొనసాగిస్తాం తగ్గించబోమంటూ ఎన్నిక సభల్లో హామీలిచ్చిన కూటమి నేతలు ఇచ్చిన హామీ నిలబెట్టుకొవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉగ్రవాద కాల్పుల్లో జవాన్ వీరమరణం

ఘన నివాళి అర్పించిన చిత్తూరు ఎంపీ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం రాగిమాని పెంట గ్రామానికి చెందిన వరదరాజులు, సెల్వి దంపతుల పెద్ద కుమారుడు పంగల కార్తీక్ సోమవారం కాశ్మీర్‌లో ఉగ్రవాద కాల్పుల్లో వీరమరణం పొందారని, వీర జవాన్‌కు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఘన నివాళు లర్పించారు. మృతుడి కుటుంబానికి ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆర్మీ జవాను కార్తిక్ మృతికి ఎమ్మెల్యే గురజాల నివాళి

జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మండలం వాసి పంగల కార్తిక్ వీరమరణం చెందడంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంతాపం తెలిపారు. ఎదురు కాల్పుల్లో గాయపడిన కార్తీక్ మృతి చెందడం బాధాకరమన్నారు. దేశ సరిహద్దుల్లో దేశం కోసం పోరాడతూ వీరమరణం చెందడం గర్వకారణమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కుటుంబంతో జవాన్ కార్తీక్

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా డాక్టర్ శేషాద్రి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డాక్టర్ ఎస్ శేషాద్రి గ్రేడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుని గత 20 సంవత్సరాలుగా చిత్తూరు జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గుర్తింపుగా చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ర కుమార్ తనను గుర్తించి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్గా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీకి అందరిని కలుపుకొని ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగేలా నా చేతనైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్గా ఎన్ను కొన్నందుకు సహకరించిన సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కి, ఎన్జీవో మిత్రులందరికీ, కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి లెనిన్

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రపంచ కార్మికవర్గానికి దిక్సూచిగా నిలిచిన కామ్రేడ్ లెనిన్ 101 వ వర్ధంతి సందర్భంగా సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ దోపిడీదారుల పాలనా తీరును వారు అనుసరిస్తున్న భోగభాగ్యాల ముతాలను కారల్ మార్క్స్ శాస్త్రీయంగా సిద్ధాంతం రాస్తే దోపిడీదార్ల పెట్టుబడి రాజ్యాంగ యంత్రాంగం అండతో తిమింగంలాగా మారిన సామ్రాజ్యవాదాన్ని మతవ్యవస్థలను ఎదిరించి పరిపాలన పరంగా సోషలిజాన్ని స్థాపించిన గొప్ప వ్యక్తి లెనిన్ అన్నారు. మార్క్సిజం పాఠాన్ని కార్మికులకు అండగా నిలిచిన పాలనాధ్యక్షుడు లెనిన్ అని, ప్రపంచంలోనే సోషలిజం మొట్టమొదటసారి రష్యాలో ఆచరణలో చూపించిన గొప్ప మార్గదర్శి అని కొనియాడారు. నూతన కార్మిక వ్యవస్థను సహించలేని సామ్రాజ్యవాదులు పార్టీ విద్రోహులతో కలిసి లెనిన్‌ను ఆయన అనుచరులను అంతమొందించడానికి ప్రయత్నం చేశారని, ఓ మహిళ చేత అతి సమీప నుండి పిస్తోలతో కాల్చడం జరిగిందని, తీవ్రంగా గాయపడిన లెనిన్ చావుబతుకుల మధ్య పోరాడి కోలుకున్నప్పటికీ 1923లో ఆరోగ్యం క్షీణించి 1924 జనవరి 21న తుది శ్వాస విడిచారని ఆయన చూపిన దారి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కార్మిక రాజ్యాలు ఏర్పడ్డాయని తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు బాలసుబ్రమణ్యం, దాము చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మృతుల కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న అడిషనల్ ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత ఏడాది నవంబర్ 7వ తేదీ విజయపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా కానిస్టేబుల్ తంగరాజ్ మరణించారు. ఆయన సతీమణి వల్లీయమ్మకు అలాగే గతేడాది అక్టోబర్ 23న ఐరాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన వెంకటరమణ సతీమణి రాణికి, బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన చలపతి సతీమణి రమదేవికి కార్పస్ ఫండ్ నుండి మంగళవారం ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం 3 లక్షల రూపాయల చెక్కులను అందించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్.మణికంత చందోలు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్‌రాజు జిల్లా పోలీస్ కార్యాలయ బి-సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, క్లర్క్ పార్థసారథి నాయుడు సమక్షంలో అడిషనల్ ఎస్పీ కార్యాలయంలో చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ డిపార్టుమెంటు తరపున కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవ్వకుండా చూస్తామని, ఏవైనా సమస్యలుంటే నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు.

రాష్ట్రానికి మణిహారం.. విశాఖ ఉక్కు కర్మాగారం: ఎంపీ

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం: ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదాన్ని నిజం చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టడం ఆనందదాయకమని ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలలో వేలాది మందికి జీవనోపాధిగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను లాభాల బాటలో పయనింప చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడానికి సిద్ధపడ్డట్టు ఆరోపించారు. తనపై ఉన్న కేసుల నుండి తప్పించుకోవడానికి రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టడానికి వెనుకాడలేదని, తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును నాశనం చేసిన పార్టీ వైసిపి అని దుయ్యబట్టారు. అలాంటి పార్టీ నాయకులు నేడు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న టిడిపి ప్రభుత్వాన్ని విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందన్నారు. కేంద్ర సహకారంతో, రాష్ట్రంలోని జనసైనికుల తోడ్పాటుతో తెలుగుదేశం పార్టీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తోందని అలాగే గత ఎన్నికల ప్రచారంలో ఎన్డీఏ కూటమి తరుపున బాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతామని పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

పలమనేరు: ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక భరోసా లభించిందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ఆనాడు నష్టాల నుంచి నేడు ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్రకే గాక యావత్ ఆంధ్రరాష్ట్రానికి మణిహారం విశాఖ కర్మాగారమన్నారు. వేలాది మంది తెలుగువారు విరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవింపజేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. నేడు ఆర్థిక సంక్షోభంలో పూడుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్ను కాపాడేందుకు రూ.11,440కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ కమిటీ ఆమోద ముద్ర వేయడం శుభపరిణామం అన్నారు.



విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు : ఎంపి

చిత్తూరు అర్బన్: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో తెలుగోళ్ల విరోచితంగా కలిసి పోరాడి, ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్రప్రదేశ్‌కు మణిహారమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా సాధ్యమైందన్నారు. విశాఖ ఉక్కు ప్లాంట్‌ను పునరుజ్జీవింప జేయడానికి ఎన్‌డిఏ సర్కార్ అన్నిరకాల సహకరిస్తుందన్నారు. 2002లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు.

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగానే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు జీవం వచ్చిందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడేందుకు రూ.11,440లు కోట్ల ఆర్థిక ప్యాకేజీకి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసిందన్నారు.



గిరిజనులు పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్, రామకుప్పం: గిరిజనులకు అండగా ఎప్పుడూ తెలుగుదేశం పార్టీ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన కుప్పం నియోజకవర్గ పరిధిలో పర్యటించారు. ఇందులో భాగంగా కుప్పం మండలం కందుంది గ్రామంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎంతగానో సహకరిస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తూ రాయితీతో కూడిన ఋనాలను అందిస్తున్నారని తెలిపారు. అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులను గుర్తించిన ఏకైక ప్రభుత్వం తెలుగుదేశమేనని అన్నారు. గిరిజన ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. ముఖ్యంగా గిరిజన పిల్లలు నాణ్యమైన విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక వసతి గృహాలను ఏర్పాటుచేసి, ఉత్తమ విద్యను అందించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ట్రైకార్ సంస్థ చిత్తశుద్ధితో పనిచేస్తూ ఎస్టీల అభివృద్ధికి అవసరమైన అన్నిచర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రైకార్ సభ్యులు అనురాధ, పి.లావణ్య, జిల్లా గిరిజన సంక్షేమఅధికారి మూర్తి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముఖాముఖిలో పాల్గొన్న అధ్యక్షులు శ్రీనివాసులు

అపోలో టోటల్ హెల్త్ సెంటర్‌లో

మొబైల్, శాటిలైట్ క్లినిక్ ప్రారంభం

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో ఆసుపత్రి ఛైర్మన్ ప్రతాప్ సి రెడ్డి

ప్రజాశక్తి- తవణంపల్లి: గుండె సంబంధిత వ్యాధులు మధుమేహం రక్తపోటు వ్యాధులను నివారణే లక్ష్యంగా అరగొండ అపోలో టోటల్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మొబైల్, శాటిలైట్ క్లినిక్‌ను అపోలో ఆసుపత్రి ఛైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సును పెంపొందించే లక్ష్యంతో టోటల్ హెల్త్ సెంటర్‌ను 2013లోని స్థాపించి సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవా కార్యక్రమంను నిర్వహించడం జరిగిందన్నారు. 2024లో నిర్వహించిన పరిశోధన అధ్యయనంలో గుండె సంబంధించిన వ్యాధులు మధుమేహం రక్తపోటుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ఆందోళనకరమైన గణంకాలు బయటపడిందని తెలిపారు. ఈ అధ్యయనం ప్రకారం తవణంపల్లి మండలంలోని ఈ వ్యాధులను నివారించేందుకు అపోలో యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో మొబైల్, శాటిలైట్ క్లినిక్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మొబైల్, శాటిలైట్ క్లినిక్ ద్వారా అధునాతన వైద్యాన్ని ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. అన్ని రకాల వ్యాధులకు ఈ మొబైల్ ద్వారా వైద్యం సేవలు పొందవచ్చు అన్నారు. ఈసేవలను తవణంపల్లి, ఐరాల మండలం ప్రజలకు ప్రస్తుతం అందజేయడం జరుగుతుందని అలాగే మిగిలిన మండలాలకు కూడా విస్తరించడం జరుగుతుందని తెలియజేశారు. పూర్తిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఇష్టమైన ఆయుర్వేదం వైద్యం కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోడీతో కూడా చర్చించడం జరిగిందన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యంతో అపోలో ఆసుపత్రి యాజమాన్యం ముందడుగు వేస్తుందని తెలియజేశారు. అపోలో ప్రతాప్ రెడ్డి సతీమణి సుచిత్ర రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ప్రితా రెడ్డి, నరోత్తమ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాంబాబు చంద్రశేఖర్ రెడ్డి, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

అందిన అర్జీలను పరిష్కరించాలి: జెసి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించాలని జెసి విద్యాధరి అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి విద్యాధరి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం కానీ వాటి గురించి ఇరువర్గాలతో చర్చించి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. పలమనేరు ఆర్‌డిఓ భవాని, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, డిప్యూటి తహశీల్దార్ కళ్యాణి మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలంలో మొరం, కుర్మాయి గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను పరిశీలించిన ఫ్రాన్స్ దేశీయురాలు రేణుక జార్జ్, రైతు సాధికార సంస్థ స్టేట్ ఆఫీస్ నుండి మన్మోహన్ మంగళవారం పరిశీలించారు. మొరం గ్రామంలో రమేష్ ఫీల్డ్ పర్యవేక్షించి, అందులోనీ పంటల రకాలు గురించి వాటివల్ల వచ్చే ఆదాయం, ప్రకృతి వ్యవసాయంలోకి రావడానికి గల కారణాలు , అనుభవాలు గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఎన్‌పిఎమ్ షాపు గురించి, ఆవుల గురించి వాటివల్ల వచ్చే ఆదాయం గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. తరువాత కుర్మాయి గ్రామంలో చందుల్ రెడ్డి అనే రైతు పొలంలో దేశీ రకాలు సీడ్స్ డెవలప్ గురించి, దేశీ వెరైటీ సీడ్ వరి నారుమడిలో రకాలు, కూరగాయలు రకాలు గురించి వాటి వల్ల లాభాల గురించి అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఏఓ సంధ్యా, డిఆర్‌సి ఏఓ భారతి, సిరికల్చర్ ఎస్‌ఓ తులసీ నాయక్, ఏపిసిఎన్ఎఫ్ ఐ.విజయ, కూర్మాయి ఆర్‌బికె ఇన్‌ఛార్జి స్పందన, జరావారిపల్లి విఎస్ఏ ఎం.మహేష్, రైతులు పాల్గొన్నారు.

బృందావనం షెడ్ల తనిఖీ

బృందావనం షెడ్లను పరిశీలిస్తున్న ట్రైన్ కలెక్టర్ హిమవంశీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని ముక్కలత్తూరు, కడపగుంట గ్రామాలను ట్రైన్ కలెక్టర్ హిమవంశీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పారిశుధ్యం, ఎస్‌డబ్ల్యూపిసి బృందావనం షెడ్లను తనిఖీ చేశారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ బృందావనం షెడ్లను సక్రమంగా నిర్వహించాలని, కనీస వసతులు ఏర్పాటు చేసి తడిచెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరించి ఎరువు తయారు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి శుభ్రంగా ఉంచాలని గ్రామస్తులు వ్యాధుల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ సుధాకర్ రావు, ఎంపిడిఓ హరిప్రసాద్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు కిరణ్ కుమార్, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కాలేజీకి స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్ర విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ కడప ఆర్‌జెడితో కలిసి మహిళ డిగ్రీ కళాశాలకు స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా సాధ్యమైందని అన్నారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గుండయ్య, మాజీ సర్పంచ్ కుప్పయ్య, బాలాజీ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, గుర్రప్ప నాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటాచలం, పుల్లూరు బాబు, నియోజకవర్గ ఎస్సీసెల్ కార్యదర్శి కుమార్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

వెంకటాపురంలో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి- తవణంపల్లి : మండలంలోని ఎగువ తడకర వెంకటాపురం గ్రామంలో మంగళవారం అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌టిసి విజయ్ ఏడిపి శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, పెరటి తోటలు పెంపకం, వ్యవసాయ పద్ధతులు కాషాయం, ఘనజీవామృతం, ద్రవజీవమృతం, రసాయనిక ఎరువులు మందులు బదులు బయో ఫెర్టిలైజర్ సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించడానికి రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు.

బిసి హాస్టల్‌ను పరిశీలించిన బాబు నాయుడు

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని బిసి హాస్టల్‌లో 24 మంది పిల్లలు ఉంటున్నారు. ఈ హాస్టల్లో వసతులు సరిగా లేవని టిడిపి మండల అధ్యక్షులు బాబు నాయుడుకు ఫిర్యాదు అందడంతో ఆయన మంగళవారం హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పిల్లలను వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్నానపు గదులకు తలుపులు లేవని, కిటికీలు లేవని చలికి ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు సమస్యలు తెలిపారు. బాబు నాయుడు వార్డెన్‌తో మాట్లాడుతూ వచ్చే సోమవారం లోపు పనులన్నీ చేయాలని తన వంతు సహాయ సహకారాలు అందించడంతోపాటు కలెక్టర్‌కి సమస్యలు తెలిపి నిధులు మంజూరు చేయిసానతని హామీ ఇచ్చారు. క్లస్టర్ ఇంచార్జ్ హేమంబార్ గౌడు, సుబ్రమణి, రమేష్, మంజునాథ్ ఉన్నారు.

తహశీల్దార్‌గా సిఎస్.అనిల్ కుమార్

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండల ఇన్చార్జి తహశీల్దార్‌గా సిఎస్ అనిల్ కుమార్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. గతంలో పలమనేరు డిప్యూటీ తహశీల్దారుగా పనిచేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని మండలంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. గ్రామరెవెన్యూ అధికారులు సుబ్రహ్మణ్యం ఆచారి, ఉమాశంకర్, రాజన్న, రమణయ్య, శివకుమార్, శంకర్రాయలపేట సచివాలయ సర్వేయర్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీలో ముఠాల కుమ్ములాట

- ఎస్ఐ జోక్యంతో సద్దుమణిగిన గొడవ
- ఆస్తిదారుడు ఒకరు..
- అనుమతిదారు మరొకరు..
- ఆక్రమణదారుడు ఇంకొకరు
- ప్రభుత్వ రికార్డుల్లో లేని గ్రానైట్ క్వారీ
- భారీగా రాతి దిమ్మెలు తరలింపు
- ప్రభుత్వ ఖజానాకు కోట్లు గండి

క్వారీలో గొడవ పడుతున్న మూడు వర్గాల వారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని దుర్గరాజపురం పంచాయతీ పరిధిలో ఆర్ఆర్ పురం సమీపంలో సర్వేనెంబర్ 202/1లో 1.980హెక్టార్ల విస్తీర్ణంలో గత ఏడు నెలలుగా జరుగుతున్న అక్రమ గ్రానైట్ క్వారీలో మంగళవారం మూడు వర్గాల మధ్య గొడవ ప్రారంభమైంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన తొలిరోజుల్లోనే చిత్తూరు చెందిన గ్రానైట్ వ్యాపారి శేఖర్‌బాబు పద్మాపురం పంచాయతీ దుర్గరాజపురం గ్రామ సమీపంలో గ్రానైట్ బండపై మిషన్లు దింపి గ్రానైట్ పంపిణీ మొదలు పెట్టారు. పక్క క్వారీ చెందిన మణి నాయుడు సంతానమైన భానుప్రతాప్ గతేడాది నవంబర్ నెలలో తనకు ఈ క్వారీపై అనుమతులు వచ్చాయని, దీనికి సంబంధించి గత నెలలో చిత్తూరులో మీడియా ముఖంగాను తన ఆవేదన వ్యక్తపరిచారు. కలెక్టర్ కూడా వినతిపత్రం అందించినట్లు భాను ప్రతాప్ చెబుతున్నారు. అయితే మంగళవారం చిత్తూరుకు చెందిన శేఖర్ బాబు సదరు క్వారీ నుంచి భారీగా రాతి దిమ్మెలు ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న భానుప్రతాప్ క్వారీ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. తనకు న్యాయం చేయకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. ఇదిలా ఉండగా శేఖర్ బాబు తన అనుచరులతో క్వారీ వద్దకు చేరుకుని ఘర్షణకు దిగారు. ఈ స్థలం తలదంటూ పిల్లిగుండ్లపల్లి గ్రామానికి చెందిన గుణశేఖర్ నాయుడు భార్య మోహనమ్మ కోర్టును ఆశ్రయించిన విషయం తెలుసుకొని తనకు శనివారం రెవెన్యూ అధికారులు తన పొలం సర్వే చేసి రాళ్లు వేశారని ఈ హద్దుల లోపలే క్వారీ పనులు జరిగాయని క్వారీ వద్దకు వచ్చి హద్దులు చూపారు. రాళ్ళను శేఖర్ బాబు, అక్కడ ఉన్న వారికి, భాను ప్రతాప్‌కి చూపించారు. సదరు స్థలం తనదని ఇద్దరూ బయటకు వెళ్లిపోవాలని గొడవకు దిగి కేకలు వేయడంతో ఉద్రిక్తత నెలకొంది. దాదాపు కోట్లలలో విలువచేసే 30 అడుగుల లోతు నూరు అడుగు పొడవు రాతిని అక్రమంగా తరలించారని దీని విలువ దాదాపు 8 కోట్ల వరకు ఉంటుందని, దీనికి ప్రభుత్వం పెనాల్టీ వేస్తే ప్రభుత్వానికి సమాధానం ఎవరు చెప్తారు? ఈ రాయి ఎవరి అనుమతితో ఎవ్వరికి తరలించావని మోహనమ్మ, ఆమె భర్త గుణశేఖర్ నాయుడు మిగిలిన ఇద్దరితో వాగ్వాగానికి దిగారు. ఘర్షణ పెరిగి పరిస్థితి ఉధృతంగా మారడంతో సమాచారం తెలుసుకున్న ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ ఫోన్ ద్వారా వారితో మాట్లాడి గొడవ వద్దని పోలీస్‌స్టేషన్‌కు రావాలని మైన్స్, రెవెన్యూ అధికారుల సమక్షంలో మాట్లాడుకోవచ్చని సూచించడంతో గొడవ సద్దుమణిగింది.

పీఎం ఆవాస్ యోజన కుటుంబానికి రాష్ట్రపతి ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద, గృహ నిర్మాణం చేసుకున్న కుటుంబానికి, రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానపత్రిక అందింది. ఆహ్వానం తమకెంతో సంతోషంగా ఉందని లబ్ధిదారులు తెలిపారు. చిత్తూరు ప్రశాంత్ నగర్‌లో సర్దార్ సల్మా దంపతులు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహనిర్మాణం పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్లో ఈనెల 26న జరగనున్న విందు కార్యక్రమానికి రావలసిందిగా వీరికి ఆహ్వానం అందింది. మంగళవారం ఆహ్వాన పత్రికను పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వికె. గణపతి, అసిస్టెంట్ పోస్ట్మాస్టర్ ఏవి.భాస్కర్ కి అందజేశారు. ఈ సందర్భంగా సర్దార్ సల్మా దంపతులతో పాటు, పోస్టల్ శాఖ గృహ నిర్మాణ శాఖ అధికారులు వారిని అభినందించి, తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వీరికి ఉచిత రవాణాతో పాటు ఉచిత వసతి కేంద్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు జిల్లాలు ఎంపికైందని అందులో చిత్తూరు జిల్లా నుంచి చిత్తూరు నగరపరిధిలో ప్రసాద్ నగర్‌కు వారు ఎంపిక అయినందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, హౌసింగ్ ఉన్నతాధికారులు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టు ఉమెన్, లక్ష్మీ ప్రసన్న, లబ్ధిదారులు అందించారు.

మాదారి, మాదాసి కురువను

ఎస్సీ జాబితాలో చేర్చాలి

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్త- చిత్తూరుఅర్బన్: మాదారీ కురువను ఎస్సీ జాబితాలో చేర్చాలని మాదారి కురువ సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పు మేరకు మాదరి కురువను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిటి కమిషన్‌కు వినతి చేశారు. ఈ మదారి కురువ ఎస్సి సంక్షేమ సంఘం సభ్యులు జబ్బల రవీంద్ర, బెల్లీ జయన్న, కప్పల నాగరాజు, జగ్రాపల్లి వెంకట మల్లు, దుబ్బిగాళ్ల రమేష్, కే శ్రీనివాసులు, దుర్గం బాలకృష్ణ, బిజీ వసంత్ కుమార్, జి.శంకర్ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరాలు

జీడీ నెల్లూరులో..

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య శాఖ ఏడి మురళీమోహన్ అన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ముక్కల్తూరులో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 22 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. 58 దూడలకు నట్టల నివారణ, 700 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణవైద్యం చేశారు. వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు, సిబ్బంది నవీన్, నాగమ్మ, గణేష్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పశువుల్లో గర్భకోశ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని పశువర్ధక శాఖ ఉప సంచాలకులు ఆరిఫ్, లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని మడుపోలూరు, వేపనపల్లి, మొగిలి గ్రామాల్లో పశువైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం

సోమలలో..

నట్టల నివారణ మందును పశువులకు తాగించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, సర్పంచ్ శిబ స్వామిదాస్, ప్రాంతీయ పశువైద్య సంచాలకులు ఆసిఫ్, ఝాన్సీ పాల్గొన్నారు.

సోమల: మండలం నంజంపేట పంచాయతీ సరస్వతీపురం, పొదలకుంటపల్లి పంచాయతీ తుగడంవారిపల్లి గ్రామంలో మంగళవారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారిని చందన ప్రియ ఆధ్వర్యంలో 411 పశువులకు పిడుదుల మందు పిచికారి, 53 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 360 ఆవులు దూడలు గొర్రెలకు టీకాలు వేయడం జరిగింది. ఏడాదికో దూడ పొదుగు వాపు వ్యాధి నివారణ చికిత్సల గురించి తెలిపారు. పశు వైద్య సిబ్బంది బావ జాన్, బలరాం, ఆలీ, రవితేజ పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్ పునరుద్ధరించాలి

బకాయిలు చెల్లింపుకు రోడ్డు మ్యాప్ ప్రకటించాలి
డిఆర్‌ఓకు యుటిఎఫ్ వినతి

డిఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023 జులై 1వ తేదీ నుండి 12వ వేతన సవరణ సంఘం అమలులో ఉండాలని, గత ప్రభుత్వం మన్మోహన్ సింగ్ ఛైర్మన్‌గా ఏర్పాటు చేసి ఒక్క సమావేశాన్ని కూడా నిర్వహించకుండా తప్పుకున్నారని 18 నెలల నుంచి కాలయాపన జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.20వేల కోట్లు ఆర్థిక బకాయిలు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉందని, అది నేటికీ 32వేల కోట్ల రూపాయలకు చేరుకుందని అన్నారు. 11వ పిఆర్సి అరియర్స్ రూ.7384 కోట్లు, రూ.9650 కోట్లు, ఉద్యోగుల సరెండర్ లీవ్ ఎన్క్యాష్ రూ.2250 కోట్లు, సిపిఎస్ ఉద్యోగుల బకాయిలు రూ.2500 కోట్లు, ఏపీజిఎల్ఐ చెల్లింపులు రూ.950కోట్ల బకాయిలున్నాయి. వీటన్నిటికీ ముఖ్యమంత్రి తగిన రోడ్డు మ్యాప్ ప్రకటించే దిశగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని డిఆర్ఓ మోహన్ కుమార్‌కి అందించడం జరిగిందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి.రమణ, జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, సహాధ్యక్షులు కే.రెడ్డప్ప నాయుడు, ఎస్‌పి.బాష, టి.దక్షిణామూర్తి, కే.సరిత, డి.ఏకాంబరం, ఎం.పార్థసారథి, కే.గణేష్ కుమార్, ఎస్సీ రాజేష్ కుమార్, ఐఎస్ చిరంజీవి పాల్గొన్నారు.

సదుం మండలం సమస్యలపై సమీక్ష

ప్రజాశక్తి- సదుం: రొంపిచర్లలో పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారానికి 11 వేల కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సదుం మండలం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదుం మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏఏ గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ మారూఫ్ హుస్సేన్, ఇన్చార్జి ఎంపీడీవో డిఎస్.హరిబాబు, ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్, ఏఈఈ ఆదినారాయణ, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, మండల నాయకులు వెంకటరమణారెడ్డి, నారాయణ, అమర్నాథ్ గౌడ్, వెంకటరత్న, మారుతి రెడ్డి, మునిరెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కేశవరెడ్డి, పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చింతా రుక్మాంగద రావుకు 'జ్యోతిష్య సామ్రాట్' బిరుదు ప్రదానం

పురస్కారాలు అందుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పెనుమూరు మండలం, పెనుమూరు గ్రామానికి చెందిన చింతా రుక్మాంగద రావుకు 'జ్యోతిష్య సామ్రాట్' బిరుదును, పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక, సినీరంగ కళాకారుడు ఖాదర్ బాష షేక్‌కు 2025 సంవత్సరానికి గాను 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఐకాన్ అవార్డు'ను ప్రదానం చేశారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ పంచమ వార్షికోత్సవం, సావిత్రిబాయి పూలే 194వ జయంతిలు పురస్కరించుకుని సోమవారం హైదరాబాదు రవీంద్ర భారతి ప్రధానరంగ వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లో నిష్ణాతులై, సమాజానికి ఉపయోగపడుతున్న 60 మంది ప్రముఖులను సంస్థ గుర్తించి, వారు చేస్తున్న సేవా రంగాలను అనుసరించి, వేర్వేరు పురస్కారాలతో వీరిని సత్కరించుకుంది. అదేవిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా, పీలేరు మండలం, రేగళ్ళు గ్రామానికి చెందిన సామాజిక సేవాకార్యకర్త వై.షామీర్‌కు భారతదేశ మొదటి ముస్లీం మహిళా ఉపాధ్యాయిని, 'షేక్ ఫాతిమా జాతీయ ఐకాన్ అవార్డు', తిరుపతి జిల్లా, తిరుపతికి చెందిన డాక్టర్ సోము ఉమాపతికి గేయ రచయిత వేటూరి సుందర్రామూర్తి జాతీయ ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్, అతిథులుగా ప్రముఖ న్యూమరాలజీ, ఆస్ట్రాలజిస్ట్ దైవజ్ఞ శర్మ, డాక్టర్ రఘు అరకపూడి, న్యాయవాది జి.రవి ప్రకాష్, సినిమా, టీవీ కళాకారిణి జ్యోతి స్వరూప్, 'మా' అసోసియేషన్ ఈసి సభ్యులు మాణిక్ రావు, లీగల్ అడ్వైజర్ జ్యోతి, సినీ దర్శకులు గుర్రపు విజయ్ కుమార్, తెలంగాణ ఉద్యమ కారిణి సాజిదా సికిందర్, అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మ చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం చేస్తూ, జ్ఞాపిక, ధృవపత్రం, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాత రజ్నీ లీజు, సామాజిక సేవా కార్యకర్తలు, కళాకారులు, విద్య, వైద్య రంగాల ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన

9 మందికి రూ.90వేలు జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 9 మంది పట్టుబడ్డారు.వీరిని మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు 9మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 90,000లు జరిమానా విధించడం జరిగింది. ఈ 12 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 699 మందికి సుమారు 69.9లక్షల రూపాయల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డుభద్రత నియమాలను పాటించడం ప్రతిఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టం నిత్యబాబు తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరం, ఇది మీ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుందన్నారు. మద్యం తాగిన వ్యక్తి డ్రైవింగ్ చేయడంపై సెక్షన్ 185 కింద మొదటి సారి నేరం చేస్తే రూ. 10,000లు జరిమానా, లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చు అన్నారు. అలాగే రెండవసారి నేరం చేస్తే రూ.15,000లు లేదా 3 సంవత్సరాల జైలు శిక్ష లేదా రెండును విధించవచ్చునని కావున వాహనం నడిపే సమయంలో వాహనదారులు రోడ్డు భద్రతా, రహదారి నిభందనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానాలు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని ఇన్స్పెక్టర్ కోరారు.

మాజీ ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు ఏ దొరబాబు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం లక్ష్మీ నగర్ కాలనీలోని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ ప్రజా దర్బార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెదేపా నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గంగాధర నెల్లూరు: టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు జన్మదిన వేడుకలు చిత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గంగాధర నెల్లూరు మండల టిడిపి నేతలు జిల్లా టిడిపి కార్యనిర్వాహణ కార్యదర్శి కృష్ణమ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, జిల్లా బీసీ నాయకుడు కోదండ యాదవ్, హరీష్ యాదవ్ మాజీ ఎమ్మెల్సీ దొరబాబుకు గజమాల వేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పెనుమూరు మండలాధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, బాబు నాయుడు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు

దళిత నాయకులు రెడ్డప్ప

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఎస్సీ వర్గీకరణ వద్దని దళిత నాయకులు రెడ్డప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ వద్దని నినదించి అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చిత్తూరులో జరగుతున్న ఎస్సీ వర్గీకరణపై సమీక్ష సమావేశానికి ర్యాలీగా బయలుదేరారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వలన పలువురు నష్టపోతారని అందువలన ఎస్సీలు అభివృద్ధి చెందకుండా పోతారనే ఉద్దేశంతో వర్గీకరణ వద్దు.. ఉమ్మడిగానే ముద్దు అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. దళిత నాయకులు నవీన్, సతీష్, సుధాకర్, గోపి, భరత్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE Xth ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
I.A.No.213/2021, O.S.No.76/2021
Smt. Sakeena Bee & another ...Petitioners/Plaintiffs
Vs.
Ramju Mulju Patel & 24 others ...Respondents/Defendants
I.A.NOTICE TO THE RESPONDENT/DEFENDANT NO.9
D.9) S.Archana D/o S.Krishnama Naidu, D.No.22-268A, Lawyers Colony, Kattamanchi Road, Chittoor town.
Please take notice that the above I.A. 213/2021 filed by the petitioners/plaintiffs against you for interim injunction in the suit filed by them for Declaration of title and permanent injunction is posted to 30.01.2025 for your appearance. If you fail to appear on the said date before the above Court personally or through your Counsel on 30.01.2025 at about 10.30 a.m. and raise your objections if any, the matter will be decided exparty
Hearing Date: 30.01.2025
S.NAVEEN KUMAR
Advocate, Tirupati.

IN THE COURT OF THE Xth ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
O.S.No.76/2021
Smt. Sakeena Bee & another ...Plaintiffs
Vs.
Ramju Mulju Patel & 24 others ...Defendants
SUIT SUMMONS TO THE DEFENDANT No.9
D.9) S.Archana D/o S.Krishnama Naidu, D.No.22-268A, Lawyers Colony, Kattamanchi Road, Chittoor town.
Please take notice that the above suit filed by the plaintiffs against you for Declaration of Title and permanent injunction is posted to **30.01.2025** for your appearance. If you fail to appear on the said date before the above Court personally or through your Counsel on 30.01.2025 at about 10.30 a.m. and raise your objections if any, the matter will be decided exparty
Hearing Date: 30.01.2025
S.NAVEEN KUMAR
Advocate, Tirupati.